మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# రుణమాఫీ డబ్బులు వెంటనే రైతులకు చెల్లించాలి

### బ్యాంకు అధికారులను ఆదేశించిన మహబూబ్‌గర్ కలెక్టర్ విజయేంద్రిబోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 30 ప్రభాతవార్త :** రైతుల రుణమాఫీ డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, రైతులకు చెల్లించాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్రి బోయి బ్యాంక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి రెండవ విడత రైతు రుణమాఫీ విడుదల సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం రైతు రుణమాఫీ రెండవ విడతలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 21,589 రైతుల ఖాతాల్లో రూ. 215.44 కోట్లు జమ అవుతాయని తెలిపారు. ఈ పథకం ద్వారా చాలా కుటుంబాలు రుణ విముక్తులు అవుతారని ఆమె చెప్పారు. ఇట్టి రైతులకు వెంటనే కొత్త రుణాలు ఇచ్చి వారికి పంట పెట్టుబడికి సహాయం చేయాలని బ్యాంక్ అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా తొలి విడతలో రుణమాఫీ డబ్బులు వచ్చిన రుణ ఖాతాల రెన్యువల్ యొక్క పరిస్థితిని సమీక్షించారు. రెన్యువల్ ప్రక్రియ మందకొడిగా ఉందని, రెన్యువల్ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్

– మిగతా4లో..



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రిబోయి

# శ్రీశైలం పది గేట్లు ఎత్తివేత..

- జలాశయానికి భారీగా వరద
- 883అడుగులకు చేరిన నీటిమట్టం
- జూరాల నుంచి 41గేట్ల ద్వారా నీటి విడుదల
- నారాయణపూర్ ప్రాజెక్టు లోతట్టు ప్రాంతాలు అప్రమత్తం
- ఈ ఏడాది అత్యధికంగా 2.25లక్షల క్యూసెక్కులు దిగువకు..




**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 30, ప్రభాతవార్త :** శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద చేరుతున్నది. నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో సోమవారం 3గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మకు వరద పోటెత్తడంతో మంగళవారం సాయంత్రం 6గంటలకు 3,88460క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అయింది. జూరాల స్పిల్ వే ద్వారా 261543క్యూసెక్కులు, పవర్ హౌజ్ ద్వారా 19653క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 107246క్యూసెక్కులు శ్రీశైలానికి వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885అడుగులు, 215.807టీఎంసీలు కాగా ప్రస్తుతం 883అడుగులకు చేరగా 207టీఎంసీలకు చేరింది. దీంతో ప్రాజెక్టు 10గేట్లను 10అడుగుల ఎత్తుకు తెరిచి దిగువకు నీటి విడుదల చేశారు. ఆంధ్రా పవర్ హౌస్‌కు 25684, తెలంగాణ పవర్‌హౌజ్‌కు 35315క్యూసెక్కుల నీటి విడుదల చేయగా గేట్ల ద్వారా దిగువకు 191387 క్యూసెక్కులు సాగర్‌కు విడుదల చేస్తున్నట్ల అధికారులు తెలిపారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కృష్ణా బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులకు జలకళ సంతరించుకున్నది. కర్ణాటక ఎగువ ప్రాంతంలో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాం పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తున్నది.

**జూరాల 39గేట్ల ద్వారా..**

జూరాల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. బుధవారం సాయంత్రం 6గంటలకు అందిన సమాచారం మేరకు జూరాలకు 2,95,000 క్యూసెక్కుల వరద చేరగా 39గేట్లు ఎత్తి స్పిల్ వే ద్వారా 2,61,543 క్యూసెక్కులు, పవర్ హౌజ్ ద్వారా 19వేల653క్యూసెక్కులు దిగువకు వదిలారు. జూరాలలో పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 8.434టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లోని విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. జూరాల నుంచి భీమా లిఫ్ట్-1కు 650 క్యూసెక్కులు, నెట్టెంపాడు

– మిగతా4లో..



# రైతుల ఖాతాల్లోకి..

## రెండో విడుత రుణమాఫీ నిధులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారమే రైతులకు రుణమాఫీ చేస్తున్నది. ఇప్పటికే రూ.లక్ష లోపు రుణమాలు మాఫీ చేయగా, తాజా మంగళవారం హైదరాబాద్‌లో మంత్రుల సమక్షంలో రూ.లక్షన్నరలోపు రుణమాఫీ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేయడంతో రైతులు సంబురాలు చేసుకుంటున్నారు. నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నట్లు సీఎం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 104113మంది రైతులకు చెందిన రూ.1019కోట్లు రుణమాఫీ నిధులు రైతులు ఖాతాల్లో జమ అయ్యాయి. ప్రభుత్వం చెప్పినట్లుగానే రుణమాఫీ చేయడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఇదిలా ఉండగా రూ.2లక్షల లోపు రుణాలకు ఆగస్టు నెలలోనే మాఫీ చేయనున్నట్లు సీఎం ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. *- మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 30, ప్రభాతవార్త*

- రూ.లక్షన్నరలోపు రైతులకు రుణమాఫీ విడుదల
- ఉమ్మడి జిల్లాలో లక్షలమందికిపైగా లబ్ధి
- వచ్చే నెలలోనే రూ.2లక్షలలోపు మాఫీ చేయనున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి
- సంబురాల్లో రైతన్నలు.. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకాలు



**ఆగస్టులో రూ.2లక్షలోపు..**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్ పేరిట ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ పథకం అమలు చేస్తున్నది. ఇందులో భాగంగా గత వారమే రూ.లక్షలోపు రైతుల రుణాలు మాఫీ చేయగా తాజాగా మంగళవారం రూ.లక్షన్నరలోపు రుణాలు ఉన్న రైతులకు ఖాతాల్లోకి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేశారు. మొదటి విడుతలో మహబూబ్‌నగర్ జిల్లాలో 35198మంది రైతుకుటుంబాలకు 194.47కోట్లు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 46780మంది, జోగులాంబ గద్వాల జిల్లాలో 24,398మంది, వనపర్తిలో 28408మంది, నారాయణపేట జిల్లాలో 27,345మంది రైతులకు లక్షలోపు మాఫీ అయిన సంగతి తెలిసిందే. అయితే గతంలో చెప్పిన విధంగా రూ.2లక్షల లోపు రైతులకు ఆగస్టు నెలలోనే రుణమాఫీ వర్తింపజేయనున్నట్లు సీఎం పురుద్ఘాటించడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 మధ్య ఆయా బ్యాంకుల్లో రుణం పొందిన రైతులకు రుణమాఫీ వర్తింపజేయనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబురాలకు సన్నద్ధం చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో రైతు రుణమాఫీ వివరాలు**

| జిల్లా | రైతులు | రూ.కోట్లు |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 21,589 | 215.44 |
| నాగర్‌కర్నూల్ | 32,406 | 312 |
| వనపర్తి | 15,085 | 140 |
| నారాయణపేట | 17,880 | 186 |
| జోగులాంబ | 16,489 | 166 |

## రైతు రుణమాఫీ దేశచరిత్రలోనే రికార్డ్



స్వతంత్ర భారత దేశ చరిత్రలోనే ఇప్పటివరకు ఏ రాష్ట్ర తలపెట్టలేనంత పెద్ద మొత్తంలో రైతులకు రుణమాఫీ చేస్తూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం రికార్డు నెలకొల్పింది. తొలి విడుత లక్షలోపు, ప్రస్తుతం లక్షన్నర లోపు రైతులకు రుణమాఫీ చేశాం. 12రోజుల వ్యవధిలోనే రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఖాతాల్లో 12,224కోట్లు జమచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టులోనే మూడోవిడుత రుణమాఫీ ప్రక్రియను వందశాతం పూర్తి చేస్తాం. కాంగ్రెస్ రైతుసంక్షేమ ప్రభుత్వం. దేశంలోనే ఇంత పెద్ద మొత్తంలో రుణమాఫీ చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే. అందుకు సంతోషంగా గర్వంగా ఉంది."

- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

### సొంత గూటికి

# ఎమ్మెల్యే బండ్ల..



**గద్వాల, జులై 30, ప్రభాతవార్త :** గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి సొంత గూటికి చేరుతున్నారు. ఇటీవలె సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం కేటీఆర్‌తో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తిరిగి సమావేశమయ్యారు. తనకు కాంగ్రెస్‌లో తగిన గౌరవం దక్కకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. అయితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14అసెంబ్లీ స్థానాలకు రెండు స్థానాల్లో బీఆర్ఎస్ గెలువగా అందులో గద్వాల ఒకటి. బండ్ల పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సమాచారం రావడంతో గద్వాల కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. అయినా అవేమీ పట్టించుకోకుండా ఇటు ఎమ్మెల్యే అటు ఎమ్మెల్యే బండ్ల హస్తం గూటికి చేరారు. చేరిన కొద్ది రోజుల్లో తిరిగి సొంత గూటికి రావడం చర్చనీయాంశం కావడమే కాదు బీఆర్ఎస్ బలం చేకూరినట్లు అయింది.

### పండుగ వాతావరణంలో

# రైతు రుణమాఫీ నిధుల విడుదల

## రైతులకు రుణమాఫీ చెక్కులను అందించిన జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల జులై 30 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ 2024 మలి విడత నిధుల విడుదల కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి రాష్ట్ర సచివాలయం ఆవరణ నుండి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రుణమాఫీ నిధులను విడుదల చేయగా, జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ అందరం నుండి జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధ్యక్షతన లబ్దిదారులైన రైతులు, వ్యవసాయ సహకార శాఖల అధికారులు, బ్యాంకర్లు, ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించి, ముఖ్యమంత్రి సందేశాన్ని తిలకించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ లబ్దిదారులైన పలువురు రైతులకు రెండవ విడత రుణమాఫీకి సంబంధించిన చెక్కులను లాంఛనంగా అందజేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ద్వారా జిల్లా రైతుల ఖాతాలలో 174.73 కోట్లు రూపాయలు జమ చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతగా ఈ నెల 18న లక్ష రూపాయలలోపు రుణాలను మాఫీ చేయగా

– మిగతా4లో..



రెండవ విడత రుణమాఫీ చెక్కులను అందజేస్తున్న కలెక్టర్

# భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి..

**వనపర్తి జులై 30 ప్రభాతవార్త :** జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేరకణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ తన ఛాంబర్ లో భూసేకరణ అంశాలకు సంబంధించి రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి అప్పాయ పల్లి, గోపాల్ పేట మండలం మున్ననూరు, సల్కలాపూర్‌కు సంబంధించిన వాటికి వారం రోజుల్లో పి.డి అవార్డు జారీ చేయాలని భూ సేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్‌ను ఆదేశించారు. గణప సముద్రం, మాధవరావు పల్లి, మామిడి మాడ ప్రాంతంలో భూసేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఇతర సమస్యలు, పురావాస కేంద్రాల పై త్వరలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సి.హెచ్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్.ఈ సత్యషీలా రెడ్డి, ఇరిగేషన్ ఈ.ఈలు మధుసూదన్ రావు, కేశవరావు, పంచాయతీ రాజ్ ఈ.ఈ మల్లయ్య, డి.ఈలు పాల్గొన్నారు.



జిల్లా ఉన్నత శాఖ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

# పద్నాలుగు రోజుల్లోనే పట్టుకున్నారు..

### బస్సులోని రూ.36 లక్షల చోరీ కేసును ఛేదించిన జడ్చర్ల పోలీసులు
### రూ.29.25 లక్షలు రికవరీ
### యూపీ రాష్ట్రానికి చెందిన ముగ్గురు నిందితుల రిమాండ్
### జడ్చర్ల పోలీసులను అభినందించిన రివార్డు అందజేసిన ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 30 ప్రభాతవార్త :** జడ్చర్ల ఆర్టీసి బస్టాండ్ లో టిఎస్ ఆర్టీసి బస్సులో చోరీకి గురైన 36 లక్షల కేసును 14 రోజుల లోనే చేదించి నిందితులను అదుపులోకి తీసుకున్న జడ్చర్ల పోలీసులను మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ అభినందించారు. ఈ మేరకు మంగళవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. జడ్చర్ల పట్టణ కేంద్రంలో ఈనెల 16వ తేదీన పికెట్ డిపోకు చెందిన ఆర్టీసి సూపర్ లగ్జరీ బస్సులో 36 లక్షల నగదు చోరీ చోటు చేసుకుందని, హైదరాబాద్ నుండి కర్నూలువైపు దామోదర్ అనే ట్రాన్స్‌కో ఉద్యోగి తన చెల్లెలి అవసరాల కోసం పిఎఫ్ సేవింగ్స్ డబ్బులను మొత్తం 38 లక్షల రూపాయల మేర డ్రా చేసుకుని 36 లక్షలు ఒక కవర్‌లో 2 లక్షలు ఒక కవర్‌లో పెట్టుకుని హైదరాబాద్‌లోని ఎంజిబిఎస్ బస్టాండ్ నుండి పికెట్ డిపోకి చెందిన ఆర్టీసి సూపర్ లగ్జరీ బస్సులో బయలుదేరాడు. తనవద్ద ఉన్న డబ్బుల బ్యాగును బస్సులో ఉన్న పై క్యాబిన్‌లో ఉంచాడు. ఈ క్రమంలోనే జడ్చర్ల పట్టణంలోని ఆర్టీసి బస్సును బస్టాండ్‌లో విరామం కోసం నిలపడంతో అప్పటికే దామోదర్ బ్యాగులో ఉన్న డబ్బులను గుర్తు తెలియని దుండగులు అపహరించడంతో

– మిగతా4లో..



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి

# రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- 6527 రైతు కుటుంబాలకు
- రూ.154.58 కోట్ల పంట ఋణ మాఫీ...!
- మొదటివిడతలో 1140 మంది రైతులకు
- ఋణమాఫీ జరగలేదు త్వరలో జమ చేస్తాం...!
- వనపర్తిలో పంట ఋణ మాఫీ నిధులను
- విడుదల చేసిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి...!

**వనపర్తి ప్రతినిధి జులై 30 ప్రభాతవార్త :** రెండవ విడత పంట ఋణ మాఫీ సందర్భంగా వనపర్తి జిల్లాలో 16527 రైతు కుటుంబాలకు రూ.154.58 కోట్ల నిధులు విడుదల చేసిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల ఋణమాఫీలో భాగంగా మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి హైదరాబాద్‌లో రెండవ విడతగా 6.30 లక్షల రైతు కుటుంబాలకు రూ.6198 కోట్లు ఋణమాఫీ ప్రకటించగా వనపర్తి జిల్లా రైతులకు జిల్లా కలెక్టర్ ఋణమాఫీ నిధులు విడుదల చేసారు. ఐ.డి.ఒ.సి సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించగా వ్యవసాయ శాఖ అధికారులు,రైతుసంఘాల నాయకులు,రైతులు, బ్యాంకర్లు హాజరయ్యారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రెండవ విడత ఋణమాఫీ కార్యక్రమాన్ని ఐ.డి.ఒ.సిలో ఏర్పాటు చేసిన పెద్ద టివి తెరల పై విక్షించారు. ముఖ్యమంత్రి ప్రకటన అనంతరం జిల్లా కలెక్టర్ వనపర్తి జిల్లాలోని 16527 మంది రైతు కుటుంబాలకు రూ.154.58 కోట్ల నిధులు ఋణ మాఫీ చేస్తూ నిధులు విడుదల చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత ఋణమాఫీలో లక్ష రూపాయల వరకు జరిగిన ఋణమాఫీ జిల్లాలోని 27,066 మంది రైతు కుటుంబాలకు రూ.145.55 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. మొదటివిడతలో వివిధ కారణాల వల్ల 1140 మంది రైతులకు ఋణ మాఫీ జరగలేదు అన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరించుకొని వారి

– మిగతా4లో..





పంట ఋణమాఫీ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, హాజరైన అధికారులు

### శ్రీశైలం పాతాళగంగలో

# తప్పిన ప్రమాదం..

- గేట్లు ఎత్తడంతో ఒక్కసారిగి పెరిగిన నీటిమట్టం



కారును నీటిలోనుంచి బయటకు తోస్తున్న స్థానికులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 30, ప్రభాతవార్త :** శ్రీశైల ప్రాజెక్టు పాతాళగంగ వద్ద తృటిలో ప్రమాదం తప్పింది. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం దోమ మండలం దాదాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కృష్ణ, ఈశ్వర్, సిద్ధి గురుచరణ్‌గౌడ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రమేశ్ పాతాళగంగలో

– మిగతా2లో..

# వర్షపు నీటిని వృథాగా పోకుండా నిర్మాణాలు చేపట్టాలి

◆ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్



జిల్లా అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల,జులై 30,ప్రభాతవార్త:** జిల్లాలో కురుస్తున్న వర్షపు నీటిని వృద్ధాగా పోకుండా భూగర్భ జలాలు పెరిగే విధంగా నిర్మాణాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు .మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జలశక్తి అభియాన్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాలు పెంపొందే విధంగా జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటిని భూమిలో ఇంకే విధంగా పనులను చేపట్టాలన్నారు .బుగర్భ జలాలు పెరిగితే రైతులకు లాభం చేకూరుతుందని ,నీటిని ఒడిసి పట్టేందుకు లోతట్టు ప్రాంతాలలో అవసరమైన నిర్మాణాలు చేపట్టిన సూచించారు .గత ఐదు సంవత్సరాలుగా చేపట్టిన పనుల వివరాలను అందజేయాలని అధికారులకు ఆదేశించారు కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్ అమిత్ శుక్ల తన టీం సభ్యులతో జిల్లాలో పర్యటించనున్నందున ఇప్పటి వరకు చేపట్టిన పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశం అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు,జడ్పీ సీఈఓ కాంతమ్మ, ఇరిగేషన్,ఈ శ్రీనివాసరావు.పంచాయతీరాజ్ ఈ విజయ్ కుమార్,వ్యవసాయ శాఖ అధికారి గోవిందు నాయక్,డిపిఓ వెంకట్ రెడ్డి,విద్యాశాఖ అధికారిని ఇందిరా, ఏపిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కోటమైసమ్మ బోనాలు



**బాలానగర్,జులై30 ప్రభాతవార్త:** బాలానగర్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం కోటమైసమ్మ బోనాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.బోనాల ఊరేగింపు నిర్వహించి బొడ్రాయివద్ద పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు.ఈ వేడుకలో గ్రామ పెద్దలు, రాజకీయ ప్రముఖులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో రోగులు, బాలింతలకు అల్పాహారం పంపిణీ



ఆసుపత్రిలో రోగులకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్,జులై 30 ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై అభిమానంతో బాలింతలు, రోగులకు కాంగ్రెస్ కార్యకర్తలు దండు రాము, సురేందర్‌గౌడ్ అల్పాహార పంపిణీ చేశారు. గత 5 రోజుల నుండి దాదాపు ప్రతిరోజూ సుమారు 25 మంది వరకు అల్పాహారం అందిస్తున్నామని దండు రాము చెప్పారు. సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో అందరి సహకారంతో నిరంతరంగా కొనసాగించే చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ బోనాలు నిర్వహిస్తున్న దృశ్యం

**రాజాపూర్,జులై 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో మంగళవారం పోచమ్మ బోనాల వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బోనాలను ఊరేగింపు నిర్వహించి బొడ్రాయి వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. రాఘవేందర్‌గౌడ్ పోతురాజు వేషధారణతో ప్రజలను ఆకర్షించారు. మాజీ సర్పంచ్‌లు మైపాల్‌రెడ్డి, రామకృష్ణగౌడ్, యువత మండల అధ్యక్షులు బంగారి వెంకటేష్, పార్టీ వైస్‌ప్రెసిడెంట్ గోవర్ధన్‌రెడ్డి, మాజీఏఎంసి డైరెక్టర్ మోహన్‌రెడ్డి, విఆర్ఓ శ్రీనివాస్,మాజీవార్డు సభ్యులు రామ్,చంద్రయ్య, మహిపాల్‌రెడ్డి,సి.నర్సిలు,విష్ణు,పి.నర్సింలు, ఉపేందర్‌రెడ్డి,నర్సింగరావు సత్యం, గోపాల్,మల్లేష్‌గౌడ్, రమేష్,రాధాకృష్ణ, శరత్,శేఖర్, జంగయ్య, సుజీవన్, పృథ్వీరాజ్, భరత్ గ్రామపెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గోడ పత్రిక విడుదల



**కొత్తకోట జులై 30 ప్రభాతవార్త:** అవ్వాతాతలకు ఉత్తరం రాద్దాం రండి అనే లేఖ రచనపై గరిపెల్లి ట్రస్టు, పత్తిపాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో బడిపిల్లల సృజనాత్మక కార్యక్రమాలు తెలంగాణ వ్యాప్తంగా ఎంపిక చేసిన 30 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ప్రిన్సిపాల్ శ్రీనివాస చారి తెలిపారు. అందుకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేఖారచన కనుమరుగైతున్న తరుణంలో పిల్లలో లేఖా రచనను ప్రోత్సహించడానికి గాను అవ్వాతాతలకు ఉత్తరం రాద్దాం రండి కార్యక్రమాన్ని...అదేవిధంగా కవిత కథ పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు.శుక్రవారం రోజున నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్యశాల కన్వీనర్ డా.తూర్పింటి నరేష్ కుమార్, కార్యశాల విషయ నిపుణులు రాఘవేంద్ర శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మండల పంచాయతీ అధికారిగా ఆర్.లక్ష్మణ్

**వెల్దండ, జూలై 30 ప్రభాతవార్త:** వెల్దండ మండల పంచాయతీ అధికారిగా ఆర్.లక్ష్మణ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. వెల్దండ మండలంలో ఎంపీఓగా విధులు నిర్వహించిన సునిత కల్వకుర్తి మండలానికి బదిలీపై వెళ్లారు. కార్యాలయానికి టైపిస్ట్ పరమేశ్వర్, అటెండర్ సుజాతలు బదిలీపై రాగా, వెల్దండలో పనిచేసిన టైపిస్ట్ పద్మ బల్మూర్‌కు బదిలీపై వెళ్లారు.

# రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

◆ పదేండ్లు టిఆర్ఎస్ చేసిందేమి లేదు

◆ 7 లక్షల కోట్ల అప్పులు మిగిల్చారు

◆ టిపిసిసి ఉపాధ్యక్షులు, టీజీఎంఎఫ్‌సి ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్



మాట్లాడుతున్న ఒబేదుల్లా కొత్వాల్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 30 ప్రభాతవార్త :** ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన కొనసాగుతున్నదని, కాంగ్రెస్ రైతు సంక్షేమ ప్రభుత్వమని టిపిసిసి ఉపాధ్యక్షులు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందని ఆరోపించారు. రూ. 7 లక్షల కోట్ల అప్పులు చేశారని ప్రజల పక్షాన పని చేయలేదన్నారు. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం హంగు ఆర్భాటాలకు పోయిందే తప్పా చేసిందేమి లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలే ఉమ్మడి జిల్లా సమీక్ష నిర్వహించి పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికోసం దృష్టి పెట్టినట్లు తెలిపారు. జిల్లాలో విద్యాభివృద్ధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు కూడా ఏర్పాటు కానున్నాయని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ బడ్జెట్‌లో ఎంఎస్పీ ప్రకటించడం హర్షణీయమని అన్నారు. వ్యవసాయ రంగం బలోపేతం కోసం సీఎం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే లక్షలోపు ఉన్న రైతులకు రుణమాఫీ విడుదల చేయగా, మంగళవారం లక్షన్నరలోపు రైతులకు కూడా రుణమాఫీ నిధులు రైతుల ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. సీనియర్ నేత ఎన్‌పి వెంకటేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే ఖచ్చితంగా అమలు చేసి తీరుతుందన్నారు. దేశ చరిత్రలోనే వ్యవసాయ రంగానికి బడ్జెట్ రూ. 72 వేల కోట్లు కేటాయించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.సమావేశంలో డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకుమార్‌గౌడ్, మీడియా సెల్ కన్వీనర్ సిజె బెనహర్, జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనిత, నాయకులు గంజి ఆంజనేయులు, జాకీర్, బాలస్వామి పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు సరికాదు

◆ ఆశ, గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి ◆ సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఉపాధ్యక్షుడు కిల్లెగోపాల్



మహబూబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బైఠాయించిన ఆశా, గ్రామ పంచాయతీ కార్మికులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 30 ప్రభాతవార్త:** ఛలో హైద్రాబాద్ కార్యక్రమానికి తరలుతున్న ఆశా, గ్రామ పంచాయతీ కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఉపాధ్యక్షుడు కిల్లెగోపాల్ అన్నారు. గత 20 రోజులకు ముందుగానే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితోనే గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు పరచాలని, ఆశా కార్మికులు పారితోషికాలు వద్దు కనీస వేతనాలు ఇవ్వాలని, జాబ్ చార్టు విడుదల చేయాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 18000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశలు గ్రామ పంచాయతీ కార్మికులు మంగళవారం ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి బయలుదేరిన కార్మికులను జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడే కట్టడి చేసి అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.పోలీస్ స్టేషన్‌లో ఆశాలను, గ్రామ పంచాయతీ కార్మికులను అక్రమంగా నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్మికులను వెళ్లకుండా బస్సులను తనిఖీ చేయడం, రైళ్లను తనిఖీ చేయడం, ప్రైవేట్ వెహికల్లో కూడా వెళ్లకుండా నిర్బంధించడం అరెస్టులకు పాల్పడడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడిన కార్మికులు టిఆర్ఎస్‌ను గద్దెదింపి కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కడితే అదే పద్ధతిలో ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తుందని వారు విమర్శించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం స్కీములన్నింటిని ప్రైవేటీకరించడానికి స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్ప దానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని దానికి వ్యతిరేకంగా ఆందోళన పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇవ్వకుండా, బిజెపి అడుగులోనే కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుందని వారు విమర్శించారు. మహబూబ్‌నగర్ టూటౌన్, వన్‌టౌన్ రూరల్, అన్ని పోలీస్ స్టేషన్‌లో వందలాది మంది ఆశాలను, గ్రామ పంచాయతీ మున్సిపల్ కార్మికులను అరెస్టులు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని లేనిచో మరిన్ని పోరాటాలకుఆశ, గ్రామ పంచాయతీకార్మికులు సిద్ధమవుతారని ప్రభుతాన్ని హెచ్చరించారు. సిఐటియు జిల్లా కోశాధికారి చంద్రకాంత్, పట్టణ సిఐటియు నాయకులు రాజ్‌కుమార్, జ్యోతి కమల, రాధా, నర్సమ్మ, యాదమ్మ, పద్మ,ఏరానరసింహులు,వెంకటరావు,విశ్వనాథం,చెన్నయ్య పాల్గొన్నారు.

# పియులో ఘనంగా సినారె జయంతి



సినారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పియు అధ్యాపక బృందం

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై30 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వ విద్యాలయంలో డాక్టర్ సి. నారాయణరెడ్డి 93వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో ప్రముఖ తెలంగాణ సాహితీవేత్త పద్మభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, ప్రముఖ తెలుగు సినీ గేయ రచయిత ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి93వ జయంతిని పురస్కరించుకుని పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు డా.నెమ్మికంటి సంధ్యారాణి అధ్యక్షతన నిర్వహించారు. కరీంనగర్ జిల్లాలో నేటి సిరిగల్ల జిల్లాలో ఒక మారుమూల పల్లెటూరు అనుమాజిపేటలో మల్లారెడ్డి బుచ్చమ్మ, పుణ్య దంపతులకు జన్మించి ఉపాధ్యాయుడిగా, ఆచార్యుడు, విశ్వ విద్యాలయ ఉప కులపతిగా,రాజ్యసభ సభ్యుడిగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడిగా వివిధ హోదాలలో తెలుగు వారికి సినారె తన సేవలను అందించారని వక్తలు గుర్తు చేశారు.సినారె జయంతి అంటే తెలుగు ప్రజలందరికి ఒక పండుగ రోజు అని పేర్కొన్నారు. తెలుగు ప్రజల కీర్తిని ప్రపంచ నలుమూలల వ్యాపింపజేసినటువంటి తెలంగాణ సాహితీ దిగ్గజం డా.సి.నారాయణరెడ్డిజయంతిని ఘనంగా పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డా. ఎన్. సంధ్యారాణి, తెలుగుశాఖ అధ్యాకులు డా.బి. రవిందర్‌గౌడ్, రఘు,ఎంఏ తెలుగు విద్యార్థినీ, విద్యార్థులు, పాలమూరు విశ్వ విద్యా లయం పిఆర్ఓ డా.రవికుమార్ పాల్గొన్నారు.

# ఠాణాకు వచ్చేవారి పట్ల నిర్లక్ష్యం చేయొద్దు

### పీఎస్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ డి. జానకి



**రాజాపూర్,జులై 30 ప్రభాతవార్త :** పోలీసులు రాత్రి, పగలు అనే తేడా లేకుండాప్రజలకు అందుబాటులో ఉండాలనిశాంతి భద్రతల పట్ల ఎలాంటి నిర్లక్ష్యంచేయరాదని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి అన్నారు. మంగళవారం వార్షిక తనిఖీలో భాగంగా రాజాపూర్ పోలీస్ స్టేషన్‌ను జడ్చర్ల రూరల్ సిఐ నాగార్జునగౌడ్‌తో కలిసి ఆమె సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించిన ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని ఎప్పుడు ఏ ఫోన్‌కాల్ వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. **పోలీస్ స్టేషన్ ఆవరణలో నాటిన మొక్కలు:** పోలీస్ స్టేషన్ పరిశుభ్రత పచ్చదనంతో ఉండడంతో స్థానిక ఎస్సై రవినాయక్‌ను పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ జానకి అభినందించారు. కార్యక్రమంలో జడ్చర్ల రూరల్ సిఐ నాగార్జునగౌడ్‌తో పాటు రాజాపూర్ సబ్ ఇన్స్‌పెక్టర్ రవి ఆయక్, ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



జిపి కార్మికులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

**చిన్నచింతకుంట,జులై 30 ప్రభాతవార్త:** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ జిపి వర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో చేపట్టనున్న సమ్మెకు వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు కురుమన్న మాట్లాడుతూ జిపి కార్మికులను పర్మినెంట్‌తో పాటు స్పెషల్ స్టేటస్, వేతనాల పెంపు, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాల రద్దు, పిఆర్‌సిలో గుర్తించాలని డిమాండ్‌లను చేస్తూ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న సమ్మెకు కార్మికులను వెళ్లకుండా అడ్డుకోవడం సరైంది కాదని ఆయన తెలిపారు.ఉద్యమాలను అరెస్టులతో అడ్డుకోవడం ప్రభుత్వానికి మంచిది కాదని ఆయన హితవు పలికారు. జిపి కార్మికులతో పాటు ఆశా కార్యకర్తలను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో జిపి కార్మికులు మోష, కురుపన్న, చిన్న, రాజు, షోలేమాన్, అనిల్‌తో పాటు ఆశా కార్యకర్తలు, జ్యోతమ్మ, లింగమ్మ, శకుంతల ఉన్నారు.

## రైతును రాజు చేయడమే లక్ష్యం

**చిన్నచింతకుంట,జులై 30 ప్రభాతవార్త:** తెలంగాణలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని అప్పంపల్లి, ముచ్చింతల సింగిల్‌విండో ఛైర్మన్‌లు సురేందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం లక్షన్నరలోపు రైతుల రుణమాఫీ ప్రభుత్వం చేయడంతో పాటు స్థానిక రైతు వేదికలో రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి రైతులనుద్దేశించి మాట్లాడిన టివిలో ప్రసారాన్ని రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి రైతునుద్దేశించి మాట్లాడిన టివిలో ప్రసారాన్ని రైతులతో కలిసి వీక్షించారు. మండలంలో లక్షలోపు రుణమాఫీని 2,475 మంది రైతులకు చేయగా రెండవ విడతగా లక్షన్నర ఉన్న 1268 మంది రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందని విండో ఛైర్మన్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేసే ప్రభుత్వమని వారు తెలిపారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని అలాంటి ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేష్‌న్నా, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి సందేశం వింటున్న నాయకులు, రైతులు

# సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

● సీఎం చదువుకున్న పాఠశాలకు రూ.5కోట్లు మంజూరు చేయడం ఎంతో శుభ పరిణామం : కాంగ్రెస్ నాయకులు కాయితీ ఆశాదీప్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాయితీ ఆశాదీప్‌రెడ్డి

**కల్వకుర్తి, జూలై30 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి విద్యాభ్యాసం చేశారని, చదువుకున్న పాఠశాలను ఆధునీకరణ చేసేందుకు రూ.5కోట్లు మంజూరు చేయడం ఎంతో శుభ పరిణామమని కాంగ్రెస్ నాయకులు కాయితీ ఆశాదీప్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తుల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి పాఠశాలల్లో నెలకొని ఉన్న సమస్యలన్ని త్వరలో తొలగిపోనున్నాయని విద్యార్థినులతో ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాయితీ ఆశాదీప్‌రెడ్డి మాటాడుతూ సీఎం కల్వకుర్తి ప్రాంత వాసి కావడంతో ఈ ప్రాంతం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి కల్వకుర్తికి ఎన్నో వరాలు కురిపించారన్ని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులుసింహారెడ్డి,అశోక్,పాఠశాలసిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న హెడ్ కానిస్టేబుల్ బాలశంకర్‌రెడ్డి

**వెల్దండ, జూలై 30 ప్రభాతవార్త:** సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల జరిగే అనార్థాల, అపరిచిత వ్యక్తుల నుంచి అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ బాలశంకర్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండలం పెద్దాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలశంకర్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు చూపే ఆశలకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఒక వేళ సైబర్ నేరాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబరు 100కు సమాచారమివ్వాలని, అలాగే ప్రయాణాలు చేసే సమయంలోజాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శివ, అమర్‌సింగ్, గోపి తదితరులు ఉన్నారు.

## అయ్యవారిపల్లిలో విజయోత్సవ ర్యాలీ



అయ్యవారిపల్లిలో రుణమాఫీపై విజయోత్సవ ర్యాలీ

**ఉప్పునుంతల,జులై 30 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ రెండో దఫా విడుదల చేయడంతో మంగళవారం మండలంలోని అయ్యవారిపల్లిలో డిసిసి ప్రధాన కార్యదర్శి జిల్లెల జగత్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న దశాబ్ద కాలంలో ఏకకాలంగా రెండు లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని, నల్లమల వాసి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అచ్చంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ కృషితో అన్ని వర్గాల్లో ఉత్సాహాన్ని కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. విజయోత్సవ ర్యాలీలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జిల్లెల జగత్‌రెడ్డి, యాదవరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు ఘనంగా సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న క్లాస్‌మెంట్ సభ్యులు

**ఉప్పునుంతల,జులై30 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని పదిలో మెరిట్ సాధించిన విద్యార్థులను క్లాస్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామానికి చెందిన మహ్మద్ సమీరా పదిలో 9.8 సాధించి బాసర ఐఐటిలో సీటు పట్ల బాలికను సన్మానించారు. ఈ సందర్భంగా అచ్చంపేట డివిజన్ క్లాస్‌మెంట్ అధ్యక్షులు పెద్ది మురళి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. క్లాస్‌మెంట్ ఫౌండర్ వాస రాఘవేందర్ ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. క్లాస్‌మెంట్ క్లబ్ ద్వారా ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు తోడుగా ఉన్నామని,ముమ్ముందు ఎంతో మంది విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందిస్తూ కార్యక్రమాలు చేపడతామని ఆయన అన్నారు. అదేవిధంగా వెల్టూరు పాఠశాల విద్యార్థిని జి. ప్రవళిక 9.2 సాధించడం పట్ల అమ్మాయిని శాలువాతో ఘనంగా సన్మానించి ఆర్థిక సహాయం అందజేశారు. ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి, వెల్టూరు హైస్కూల్ హెచ్‌ఎం రవి శేఖ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఒరుగంటి సాయిప్రసాద్, ఉపాధ్యాయ బృందం నీల శ్రీధర్, శ్రీను, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు ఎల్ఓసిల పంపిణీ

**పాన్‌గల్ జులై 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన బాధితులు కావాలి బాల పీరు ఈశ్వర్ లకు సీఎం సహాయనిధి నుండి ఒక్కొక్కరికి రెండు లక్షల 50 వేలు చొప్పున మంజూరైన ఎల్ ఓసి లను కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లారావు మంగళవారం బాధితులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ రాష్ట్ర ఎక్సైజ్ అండ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడంతో ఎల్ఓసి లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఎల్ఓసి ల మంజూరు కృషిచేసిన మంత్రి జూపల్లి కాంగ్రెస్ నాయకులు పుల్లారావు బాధితులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సాయి ప్రసాద్ గౌడ్ ,కాంగ్రెస్ నాయకులు దశరథ్, రాజు ,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గోప్లాపూర్‌లో ఘనంగా బోనాల పండుగ



**భూత్పూర్, జూలై 30, ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణంలోని మూడోవార్డు గోప్లా పూర్ పట్టణంలో మంగళవారం పోచమ్మ దేవతకు బోనాల వేడుక నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా పట్టణంలోని మహిళలు, బాలికలు, చిన్నారులు, గ్రామ పెద్దలు, పలు పార్టీల నాయకులు బోనాల వేడుకలో పాల్గొన్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డప్పుల వాయిద్యాలు, మంగళకర ధ్వనుల మధ్య మహిళలు, బాలికలు భారీ ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి బోనం ఘటాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, మేకల సత్యనారాయణ, పట్నం రాములు, పట్నం శ్రీశైలం, మల్లేష్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

**అమిస్తాపూర్‌లో ఘనంగా గాలి పోచమ్మ బోనాలు:** భూత్పూర్ పట్టణంలోని అమిస్తాపూర్‌లో కురుమ, యాదవులు తమ జీవాలకు ఎలాంటి గాలి కుంటు రోగాలు రాకుండా చూడాలని ప్రతీ ఏడాది నిర్వహించే గాలి పోచమ్మ బోనాల్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో గాలి పోచమ్మ చుట్టూ జీవాల(గొర్లు, మేకలు)ను తిప్పుతూ తమ భక్తి ప్రపత్తిని చాటుకున్నారు. తమ జీవాలను కాపాడే గాలిపోచమ్మకు జీవాలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ కార్యక్రమంలో కురుమ, యాదవ సంఘం సభ్యులతో పాటు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మూష బాలస్వామి ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడి జన్మదినోత్సవం

**భూత్పూర్, జూలై 30, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ భూత్పూర్ పట్టణ అధ్యక్షుడు మూష బాలస్వామి జన్మదిన వేడుకలు మంగళవారం అమిస్తాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బాలస్వామిని శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మూష సాయిలు, సత్తూర్ అశోక్‌గౌడ్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు అజీజ్, జాకీర్, డోకూర్ శేఖర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**పాన్‌గల్ జులై 30 ప్రభాతవార్త:** గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని మండల ప్రాథమిక వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలల గర్భవతుల నమోదు తో పాటు హైరిస్క్ గర్భవతులను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెఫర్ చేయాలని సూచించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి రోగాల బారిన పడకుండా చూడాలని కోరారు. సమావేశంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎంఎల్‌హెచ్‌పి వైద్యాధికారులు నాగరాజు, మైథిలి లారెన్స్ సూపర్వైజర్లు, సంతోషమ్మ, సుమశ్రీ, హెల్త్ అసిస్టెంట్లు రామ్ చంద్రయ్య, మదన్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## అదుపు తప్పి సీఎన్జీ గ్యాస్ ట్యాంకర్ బోల్తా

### ట్యాంకర్ ఖాళీగా ఉండడంతో తప్పిన పెను ప్రమాదం

**బాలానగర్, జులై 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామ శివారులో నేషనల్ హైవేపై సిఎన్జీ గ్యాస్ ట్యాంకర్ మంగళవారం సాయంత్రం అదుపుతప్పి బోల్తా పడింది. ట్యాంకర్ ఖాళీగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ భాస్కర్‌రెడ్డికి స్వల్ప గాయాలు కాగా ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. హైదరాబాద్ నుండి జడ్చర్ల వైపు వెళ్తున్న డీసీఎం లారీని ఓవర్టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి పడిపోయిందని డ్రైవర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. హైవేపై మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ కావడంతో ఎస్సై తిరుపాజి తమ పోలీస్ సిబ్బంది క్రేన్ సహాయంతో డిసిఎంను రోడ్డుపై నుంచి పక్కకు తప్పించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## ప్రపంచ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిసిన దళిత నాయకులు

**వనపర్తి టౌన్ జులై 30 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో రూరల్ పోలీస్ స్టేషన్లో సబ్-ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి జలందర్ రెడ్డిని కలిసి అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన గంధం నాగరాజు వనపర్తి జిల్లా ఎస్సి, ఎస్టి, అట్రాసిటి, విజిలెన్స్ మెంబర్, మానటరింగ్ సభ్యులు, వనపర్తి జిల్లా వనపర్తి జిల్లా దళిత బహుజన కులాల నాయకులు కల్మూరి వెంకటేష్ ఈ సందర్భంగా పి.జలంధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ దేశంలో కులాలకు మతాలకు, దనవంతులు పేదలు అనే వర్గ బేదాలు లేకుండా కలుముషం లేకుండా అరేయ్ ఒరేయ్ అని పిలుచుకునే బందమే స్నేహ సంబంధం, అంటూ చెపుతూ ప్రతి ఒక్కరు చదువు ద్వారనే జ్ఞానం సంపాదించుకుంటే అసమానతలు దూరమౌతాయని అన్నారు. గంధం నాగరాజు మాట్లాడుతూ స్నేహం బందం అనేది మనిషి యొక్క మనుసు నుండి విరాజిల్లే మంచి గుణము ద్వారనే స్నేహానికి పునదు లేస్తాయని ఆ స్నేహమే జీవితాంతం కొనసాగుతుందని మనిషి యొక్క రక్త సంబందీకులకన్న స్నేహబందానికి ఎక్కువగా నమ్మకంగా వుంటుందని మంచి స్నేహితుడు లేని మనిషి జీవితం తోటలోని పుష్యం మాదూర్యం లేనటువంటిదని అన్నారు, ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సబ్-ఇన్ స్పెక్టర్ సి.యచ్. రామ చంద్రయ్య, హెచ్.పి.సి సత్యనారాయణ వున్నారు మంచి మనిషితో స్నేహాన్ని చేయండి, జీవితాంతం ఆయురారోగ్యాలతో వీరాజిల్లి అని అందరికి అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

**కొల్లాపూర్, జులై 30 ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యాశాఖలో నిర్లక్ష్యం చోటు చేసుకుందని ఆ శాఖకు మంత్రి లేకపోవడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి పలు బాధ్యతలతో ఉంటూ విద్యాశాఖపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తొందరలోనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని కొల్లాపూర్ ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు తరుణ్ డిమాండ్ చేశారు. మంగళవారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ కొల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎస్.తరుణ్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మాటాడుతూ హాస్టల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, నోటు పుస్తకాలు, ప్లేట్లు, దుప్పట్లు, చెప్పులు, షూ, పెన్సిళ్లు, స్కేల్ వంటివి నేటికి కూడా రాకపోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి హాస్టల్‌లో విద్యార్థులకు నిత్యావసరాలు వంటి సామాగ్రి తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేటికి కూడా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దుర్మార్గమని ఆయన విద్యాశాఖ మంత్రి పదవిని తనతోనే పెట్టుకోవడం విద్యార్థులకు తీరని ఇబ్బందికరం అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే, రానున్నరోజుల్లోగత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పెంట్లవెల్లి మండల అధ్యక్షుడు మంజునాథ్, ప్రకాష్, శివ, బన్నీ తదితర ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

## రుణమాఫీ డబ్బులు వెంటనే రైతులకు చెల్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మరో ప్రతిష్టాత్మక కార్యక్రమం ఇందిరమ్మ మహిళా శక్తికి చెందిన అన్ని పథకాలకు రుణాలు అందజేయాలని కలెక్టర్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. అలాగే సబ్సిడి వచ్చిన షెడ్యూల్ తెగలలబ్ధిదారులకు బ్యాంకురుణాలు మంజూరుచేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఎల్‌డిఎం కల్వ భాస్కర్, డిఆర్‌డిఓనర్సింహులు, బ్యాంక్‌అధికారులు నర్మద, రవి కిశోర్‌రెడ్డి, మురళీకృష్ణ, ప్రసాద్‌పాత్రో, అన్ని బ్యాంకుల కంట్రోలర్లు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

## శ్రీశైలం పది గేట్లు ఎత్తివేత..

(మొదటి పేజీ తరువాయి)

750క్యూసెక్కులు విడుదల చేశారు. మొత్తం జూరాల నుంచి 2,85,434 క్యూసెక్కులు దిగువకు వదిలారు.

**నారాయణపూర్ ప్రాజెక్టుకు:** కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు నారాయణపూర్ ప్రాజెక్టుకు 2.90,000క్యూసెక్కుల భారీ వరద వస్తుండడంతో 2,77,869క్యూసెక్కులు దిగువకు వదులుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు నీటిమట్టం 492. 25మీ. 33.313టీఎంసీలు కాగా ప్రస్తుతం 489.85మీటర్ల నీట్టిమట్టం ఉన్న ట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. భారీగా వరద జలాలు దిగువకు వదులుతున్న నేపథ్యంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

# పండుగ వాతావరణంలో రుణమాఫీ విడుదల

### కలెక్టరేట్‌లో రైతులకు లాంఛనంగా చెక్కులు అందజేసిన కలెక్టర్



మహిళా రైతుకు రుణమాఫీ చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 30 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీ 2024 రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమం మంగళవారం పండగ వాతావరణంలో అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర శాసనసభ ప్రాంగణం నుండి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వంరావు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులతో కలసి రెండవ విడత లక్షన్నర వరకు రుణమాఫీ నిధులను విడుదల చేయగా, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని ప్రధాన సమావేశ మందిరంలో కలెక్టర్ విజయేందిర బోయి అధ్యక్షతన లబ్దిదారులైన రైతులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వ్యవసాయ సహకార శాఖల అధికారులు, బ్యాంకర్లు, సహకార సంఘాల చైర్మన్లు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించి, ముఖ్యమంత్రి సందేహాన్ని తిలకించారు. జిల్లాలోని మండలంలోని రైతు వేదికలలోనూ రుణమాఫీ రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమం కొనసాగగా, ఎక్కడికక్కడ రైతులు ఉత్సాహంగా పాల్గొని తమ హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. ఒకే పంట కాలంలో రూ. రెండులక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తుండడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి లబ్దిదారులైన పలువురు రైతులకు రెండవ విడత రుణమాఫీకి సంబంధించిన నమూనా చెక్కును లాంఛనంగా అందజేశారు. రైతులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ద్వారా రైతుల ఖాతాలలో రూ. 31వేల కోట్లను జమ చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతగా ఈనెల 18న లక్ష రూపాయలలోపు రుణాలను మాఫీ చేయగా, రెండవ విడత మంగళవారం లక్షా 50 వేల రూపాయలలోపు రుణాలను మాఫీ చేస్తూ నిధులు విడుదల చేసిందన్నారు. రుణమాఫీ ద్వారా జిల్లాలో మొదటి విడతలో 35 108 మంది రైతు కుటుంబాలకు రూ. 194.47 కోట్ల మేర లబ్ధి చేకూర్చగా, మలి విడతలో 21589 మంది రైతు కుటుంబాలకు రూ. 215.44 కోట్ల నిధులను వారి ఖాతాలలో ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ వివరించారు. రైతు సంక్షేమం పరమావధిగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రుణమాఫీ కార్యక్రమం జిల్లాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగేలా అధికార యంత్రాంగం తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. రుణమాఫీ ద్వారా అర్హులైన ప్రతి రైతు ప్రయోజనం పొందేలా బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు అన్నదాతలకు తోడ్పాటును అందించాలని ఆదేశించారు. ఏ ఒక్క రైతు అసౌకర్యానికి గురి కాకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన రెండవ విడత రుణమాఫీ నిధులను రైతుల ఖాతాలలో అందుబాటులో ఉండేలా చూడాలని వారు తమ అవసరాల కోసం ఆ నిధులను వినియోగించుకునే విధంగా చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. తొలి, రెండవ విడతలలో రుణమాఫీ పొందిన రైతులందరికి జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంకటేష్, జిల్లా సహకార శాఖ అధికారిణి పద్మ, లీడ్‌బ్యాంక్ మేనేజర్ భాస్కర్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలి

### రోడ్డు భద్రత చట్టాలపై అవగాహన



**పెబ్బేర్ జులై 30 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలోని గుమ్మడం గ్రామంలో ఉదయం 9 గంటలకు గ్రామపంచియతీ వద్ద గ్రామ ప్రజలతో పెబ్బేర్ పోలీస్ స్టేషన్ ఎస్సై, సిహెచ్ హరిప్రసాద్ రెడ్డి మమేకమై అవగాహన సదస్సు ఏర్పర్చి ఈ క్రింది అంశాలపై వివరించినారు. నూతన చట్టాలపై అవగాహన : కొత్త చట్టాల శిక్ష చట్టాల శిక్ష కఠినతరంగా ఉన్నాయని గొడవలకుపాల్పకుండా ప్రజలు సామరస్యంగా కలిసిఉండాలని అనవసరమైన విషయాలపై జోక్యం చేసుకకుండా కలిసి నేరాలను అరికట్టాలని తెలియ పరిచినారు.

బాల్యవివాహాల గురించి వివరిస్తూ : పిల్లలను బాగా చదివించాలని, చదువు వల్ల కలిగే ప్రయోజనాలను తమ తమ ఇండ్లలో వారి తల్లి దండ్రులు పిల్లలకు వివరించాలని తెలియపరిచినారు. తల్లిదండ్రులు బాల్యవివాహాల వైపు మొగ్గు చూపితే బాల్య వివాహాల వల్ల దుష్పరిణామాల గురించి వివరిస్తూ సంబంధించిన బాల్య వివాహాల చట్టాల గురించి అవగాహన కలిగిస్తూ వివరించారు.

రోడ్ సేఫ్టీ వింగ్స్ : ప్రజలు వాహనాలలో ప్రయాణం చేసేటప్పుడు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని, మోటర్ సైకిల్ పై ప్రయాణించినప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా దరించాలని, ఆటోలలో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మందిని ఎక్కించుకోరాదని అవగాహన కల్పించినారు. యాక్సిడెంట్ వల్ల కలిగే పరిణామాల వల్ల కుటుంబం రోడ్డున పడుతున్నదని వారి యొక్క స్థితిగతుల గురించి అవగాహన కల్పించినారు. అదేవిధంగా వాహనదారులు తప్పనిసరిగాడ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, సంబంధిత డాక్యుమెంట్స్ కలిగి ఉండాలని తెలిపినారు. రోడ్డు భద్రత నియమావళిని పాటిస్తే ప్రమాదాలను నిరోధించవచ్చు అని తెలియపరిచినారు.

సైబర్ క్రైమ్ పై దిశా నిర్దేశం : ప్రస్తుతం సైబర్ నేరగాల మోసాలు పెరిగిపోతున్నాయని వాటికి కారణం మనమేనని నేరాలను మన చేతనే చేయిస్తున్నారని ఎందుకనగా వాట్సాప్ గ్రూప్ లో గానీ, యూట్యూబ్‌లో గాని, ఇన్స్టాగ్రామ్ లలో గాని ఉన్న ఫేక్ లింకులను ఉపయోగించినచే డబ్బును కోల్పోవడం జరుగుతుంది. మార్ఫింగ్ ఫోటోలు పెట్టి బ్లాక్ మెయిల్ చేయడం జరుగుతుంది. అదే విధంగా గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ వాట్సాప్ గ్రూపు లింకు పెట్టినామని లేదంటే మీకు టెక్స్ట్ మేసేజ్ పెట్టినామని అట్టి లింకును ఓపెన్ చేస్తే మీకు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం తెలియపరుస్తున్నామని తెలిపి ఓటీపీలను అడిగి తెలుసుకొనిఖాతాలో ఉన్నడబ్బులను దొంగలించడం జరుగుతుంది.

నకిలీ విత్తనాలపై అవగాహన : ఖరీఫ్ సీజన్ లో ప్రభుత్వంచే గుర్తింపు పొంది అనుమతించడబడిన షాపులలో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించినారు.

సీసీ కెమెరాలు యొక్క ప్రాధాన్యత : గతంలో గ్రామాలలో ఎవరో ఒకరు వయస్సు మీరిన పెద్దమనుషులు ఇంటి దగ్గర ఉండేవారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు రీత్యా ప్రజలు వారి ఇండ్లకు తాళాలు వేసి పనులకు వెళ్లడం జరుగుతుంది. ఎవరూ లేనిది చూసి దొంగతనాలకు పాల్పడడం జరుగుతుంది. గ్రామంలో సిసి కెమెరాలు అమర్చుకుంటే దొంగతనాలు నివారించవచ్చును. ఎవరైనా కొత్త వ్యక్తి గ్రామానికి వచ్చినప్పుడు సీసీ కెమెరాలలో రికార్డు అయ్యి మనం గుర్తించడానికి వీలు పడుతుంది. అదేవిధంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ ప్రజల సహకారం ఉండాలని కోరారు.

యువతకు సందేశం: గామంలోని ప్రజలకు వారి పిల్లలను మంచిగా చదివించుకోవాలని, వారి యొక్కకదలికలను అబ్జర్వేషన్ చేసుకుంటూ చెడుదారిన వెళ్లకుండా చూసుకోవాలని తెలియపరి చినారు. యువత చెడు దారిన పట్టినచో వారి తల్లిదండ్రులు పోలీసుల దృష్టికి తేవాలని సూచించినారు. అవగాహన సదస్సు అనంతరం గ్రామ ప్రజలు ఎస్సై హరి ప్రసాద్ రెడ్డిని సన్మానించడం జరిగింది.

# పెబ్బేరు దవాఖానలో వైద్యుల నిర్లక్ష్యం?

- సమయానికి వైద్యం అందక కడుపులోనే బిడ్డ మృతి
- దవాఖాన ఆవరణలో బాధితులు ఆందోళన



**పెబ్బేర్ టౌన్, జులై 30 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని చినిమిల్లకు చెందిన ప్రశాంత్ రాజేశ్వరి భార్య రాజేశ్వరి పురిటి నొప్పులు రావడంతో మంగళవారం ఉదయం పెబ్బేరు గవర్నమెంట్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఉదయం 11 గంటల వరకు చూసి పరిస్థితి విషమంగా ఉందని, వనపర్తి దవాఖానకు తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే వనపర్తి జిల్లా దవాఖానకు తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే కడుపులో బిడ్డ మృతిచెందినట్లు తెలిపారు. తక్షణ ఆపరేషన్ చేసి కడుపులోనుంచి శిశువును తీసి తల్లిని కాపాడారు. ఆగ్రహించిన బాధిత కుటుంబ సభ్యులు పెబ్బేరు ప్రభుత్వ దవాఖానకు చేరుకొని కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే పసిబిడ్డ ప్రాణం పోయిందని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేసేవరకు కదిలేది లేదని భీష్మించి కూర్చున్నారు. ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి సిబ్బందితో కలిసి దవాఖానకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఘటనకు సంబంధించి పూర్తి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. వైద్యాధికారులు కూడా దావఖాన వద్దకు చేరుకొని ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు.

## ఆస్తి వివాదాలే కారణమా..?

- కర్నూల్‌లో శవమై తేలిన పెద్ద ధన్వాడకు చెందిన శేషిరెడ్డి
- బైక్‌పై మృతదేహాన్ని తీసుకెళ్లడానికి గుర్తించిన గ్రామస్తులు
- పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెలుగులోకి..
- కొన్నేండ్లుగా అన్నదమ్ముల మధ్య భూముల పంచాయితీ
- విచారణ చేపట్టిన ఆంధ్రా పోలీసులు



శేషి రెడ్డిని హత్య చేసి శావన్ని బైక్‌పై తీసుకెళ్ళుతున్న దుండగులు

**గద్వాల, జులై 30, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో అన్నదమ్ములమధ్య నెలకొన్న ఆస్తి వివాదం హత్యకు దారితీసిందా.. కొన్నేండ్లుగా జరుగుతున్న భూముల పంచాయితీలే ఓ నిండుప్రాణం బలిగొన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాజోళి మండలం మండలంలోని పెద్దధన్వాడ గ్రామానికి చెందిన చిన్న శేషిరెడ్డి (50) సోమవారం హత్యకు గురికావడం మండలంలో కలకలం రేపింది. శేషిరెడ్డి, ఆయన సోదరులు చిన్న నాగిరెడ్డి, మహేశ్వర్ రెడ్డి మధ్య ఆస్తి పంపకాల విషయంలో 20ఏళ్లుగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో చిన్న శేషిరెడ్డి రెండు నెలల క్రితం అన్నదమ్ములుపై దాడికి పాల్పడినట్లు అతనిపై రాజోలి ఠాణాలో కేసులు నమోదయ్యాయి. మళ్లీ కొన్ని రోజులుగా గొడవలు తీవ్రమయ్యాయి. ఇదిలా ఉండగా కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలంలోని కొత్తకోటలో సోమవారం ఉదయం విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో చిన్న శేషిరెడ్డి శవమై తేలడంతో పెద్దధన్వాడ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇద్దరు వ్యక్తులు మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకొచ్చి అక్కడ పడేసినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెలుగులోకి వచ్చింది. ఈక్రమంలో కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, సి.బెళగలహ్ ఎస్సై తిమ్మారెడ్డి కొత్తకోట గ్రామాన్ని సందర్శించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కర్నూలు జిల్లాపోలీసులకు సహకారంగా రాజోలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వడ్డేపల్లి, రాజోలి, అయిజ ప్రాంతాల్లో హత్య జరిగిన ప్రాంతంలో అన్వేషిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఇదిలా ఉండగా ఆస్తి తగాదాల విషయంలో అన్నదమ్ముల మధ్య గొడవలు జరిగి, హత్యలకు దారి తీస్తుందదంతో గ్రామాల్లో ఆందోళన చెందుతున్నారు. శేషిరెడ్డి హత్యతో ఒక్కసారిగా రాజోలి, వడ్డేపల్లి, అయిజ మండలాల పరిధిలోని గ్రామాల ప్రజల ఉలిక్కిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో శేషిరెడ్డి శవం లభించడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజోలి పోలీసులు తెలిపారు.

## బైకుల ఢీ ఇరువురికి గాయాలు

**బిజినపల్లి, జులై30 ప్రభాతవార్త:** పాలెం గ్రామ సమీపంలోని పౌల్ట్రీ ఫార్మ్ వద్ద మంగళవారం రెండు బైకులు ఢీకొని ఇరువురికి గాయాలయ్యాయి. అచ్చంపేట మండలం జిన్‌కుంట గ్రామానికి చెందిన రాజశేఖర్ తన మిత్రునితో పాటు బైక్‌పై మహబూబ్‌నగర్ బయలుదేరాడు. పౌల్ట్రీ ఫార్మ్ సమీపంలోకి రాగానే బిజినపల్లి వైపు వెళ్తున్న శివనాగులు బైకును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజశేఖర్ తలకు గాయాలు కాగా కాలు విరిగిపోయింది. ఈ ప్రమాదంలో శివనాలుగుకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేశారు.

## పాఠశాలల మానిటరింగ్ పక్కాగా నిర్వహించాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 30 ప్రభాతవార్త:** పాఠశాల మానిటరింగ్ పక్కాగా నిర్వహించాలని మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్ అధికారులను ఆదేశించారు. సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో మండల విద్యాశాఖ అధికారులు, మండల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్ మాట్లాడారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో న్యూట్రిగార్డెన్స్ పెంచాలని సూచించారు. ప్రతి పాఠశాలలో నిమ్మ, మునగ, కరివేపాకు మొక్కలు విరివిగా పెంచాలని సూచించారు. రేపటి నుండి ప్రారంభం కానున్న పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలను విజయవంతంగా నిర్వహించాలని తరగతి గదిలో బోధనా అభ్యసన కృత్యాలు ఫలప్రదంగా చేయుటకు ప్రతి ఉపాధ్యాయుడిని బలోపేతం చేయాల్సిన బాధ్యత మండల విద్యాశాఖ అధికారులు, మండల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులపైన ఉన్నదని డీఈఓ సూచించారు. మానిటరింగ్ అధికారులు ఖచ్చితంగా తమ పరిధిలోని అన్ని పాఠశాలలను క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతిరోజు ఏదైనా ఒక పాఠశాలలో ప్రార్థన సమయానికి హాజరు కావాలని సూచించారు. తమ పరిధిలో పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు ఏకరూప దుస్తులు ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 100 శాతం విద్యార్థులకు చేరేలోగా చొరవ చూపవలెనని మండల విద్యాశాఖ అధికారులకు సూచించారు. అధికారులు భవితా కేంద్రాలను కూడా తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. విద్యాంజలి పోర్టల్‌లో ఎక్కువ సంఖ్యలో వాలంటీర్లు రిజిస్టర్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో సమాజ భాగస్వామ్యాన్ని బలోపేతం చేసి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ప్రతి నెలలో తల్లిదండ్రుల సమావేశాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంఓ బాలుయాదవ్ బైకాని, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, ఎఫ్ఏఓ యాదగిరి ఇతర సమగ్ర శిక్ష అధికారులు శ్రీనివాస్, సంపత్ జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు మండల నోడల్ అధికారులు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఖాతాల్లో సైతం ఋణమాఫీ జమ చేయడం జరుగుతుంది అన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటురెండవ విడతలో సైతం ఆధార్ కార్డులో పేరుకు బ్యాంకు లో ఉన్న పేరుకు తేడాఉండటం లేదా అకౌంట్ నెంబరు సరిగ్గా రాయకపోవడం వంటి చిన్నచిన్న సమస్యల వల్ల ఎవరికైనా ఋణమాఫీ రాని పక్షంలో కలెక్టరేట్ లో ఏర్పాటు చేసినకంట్రోల్ రూమ్ నెంబర్08545-22351 లేదా 08545-233525 కు ఫోన్ చేయవచ్చు అని తెలియజేశారు. ఇప్పుడు విడుదల చేసిన నిధులను రైతుల ఖాతాకు త్వరగా జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను సూచించారు. ఇంత పెద్దమొత్తంలో జరుగుచున్న ఋణమాఫీ కార్యక్రమాన్ని రైతులు అందరూ ఒకచోట గుమికూడి సంబరాలు చేసుకునే విధంగా జిల్లాలోని రైతు వేదికల్లో టి.వి తెరలు ఏర్పాటు చేశారు. ఉదయాన్నే జిల్లా కలెక్టర్ పెద్దమందడి మండలంలో మణిగిల్ల గ్రామ శివారులో జరుగుచున్న క్రాప్ బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం పెద్దమందడి, నాగవరం రైతు వేదికల్లో ఋణమాఫీ కార్యక్రమాన్ని రైతులు వీక్షించేందుకు ఏర్పాటు చేసిన టి.వి తెరల ఏర్పాట్లు పరిశీలించారు. రైతులతో ముచ్చటించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఒకేసారి ఇంత భారీ స్థాయిలో ఋణమాఫీ జరగటంతో వనపర్తి జిల్లా రైతు కుటుంబాల ఇళ్ళల్లో పండగ వాతావరణం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ మెంచు నగేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ కౌశల్ కిషోర్, ప్యాక్స్ చైర్మన్లు, బ్యాంకర్లు, మండల వ్యవసాయ అధికారులు, రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ విస్తిర్ణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పండుగ వాతావరణంలో రైతు రుణమాఫీ నిధుల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

మలివిడతగా ప్రస్తుతం లక్షా 50 వేల రూపాయల లోపు రుణాలను మాఫీ చేస్తు నిధులు విడుదల చేసిందన్నారు. రుణమాఫీ ద్వారా జిల్లాలో మొదటి విడతలో 24398 మంది రైతు కుటుంబాలకు రూ.144.09 కోట్ల మేర లబ్ధి చేకూర్చగా, మలివిడతలో 18141 మంది రైతు కుటుంబాలకు రూ.174.73 కోట్ల నిధులను వారి ఖాతాలలో ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ వివరించారు. రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రుణమాఫీ కార్యక్రమం జిల్లాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగేలా అధికార యంత్రాంగం తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. అయినప్పటికి ఎక్కడైనా క్షేత్రస్థాయిలో రైతులకు రుణమాఫీ విషయంలో ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు ఫిర్యాదులను స్వీకరించి ప్రతి ఒక్క రైతుకు ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపటడం జరుగుతుందని, అర్హులైన ప్రతి రైతు ప్రయోజనం పొందేలా బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు అన్నదాతలకు తోడ్పాటును అందించాలని ఆదేశించారు. ఏ ఒక్క రైతు అసౌకార్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదేనని స్పష్టం చేశారు. తొలి, మలి విడతలలో రుణమాఫీ పొందిన రైతులందరికి జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, జిల్లా సహకార శాఖ అధికారి ప్రసాద్ రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ అయ్యప్పరెడ్డి సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, సహకార సంఘం అధ్యక్షులు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## పద్నాలుగు రోజుల్లోనే పట్టుకున్నారు..

(మొదటి పేజీ తరువాయి)

జడ్చర్ల పోలీసులను ఆశ్రయించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

**సిసి ఫుటేజ్ ఆధారంగా...:** ఈ ఘటనపై ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసుకొని జడ్చర్ల పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి కేసు దర్యాప్తును ముమ్మరం చేశారని ఆర్టీసి బస్సులోని సిసి కెమెరాలు పని చేయకపోవడంతో ఆర్టీసి బస్టాండ్‌లోని పట్టణంలో పలు కూడళ్లలో ఉన్న సిసి కెమెరాలు పని చేయకపోవడంతో ఆర్టీసి బస్టాండ్‌లోని పట్టణంలో పలు కూడళ్లలో ఉన్న సిసి కెమెరాలను పరిశీలించామని కానీ జడ్చర్లలో సిసి కెమెరాలు తక్కువగా ఉన్నాయని సిసి ఫుటేజ్‌ల ద్వారా ఒక్క శాతం కూడా కేసు ఛేదనకు ఉపయోగపడలేదని హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల పోలీసుల సిసి ఫుటేజ్‌తో పాటు ఎంజిబిఎస్ బస్టాండ్‌లోని సిసి ఫుటేజ్‌తో పాటు టెక్నికల్ డేటా ఆధారంగా నిందితులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం టెక్నికల్ డేటా ఆధారంగా నిందితులు ఉత్తంప్రదేశ్ రాష్ట్రం బిజ్నూర్ జిల్లాకు చెందిన ఎండి షారుఖ్ 37, అబ్దుల్ సత్తార్ 55, షేక్ దిల్షాద్ అహ్మద్ 40లుగా గుర్తించామని తెలిపారు. నిందితులను ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బిజ్నూర్ జిల్లాలో యుపి పోలీసుల సహకారంతో నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుండి 29 లక్షల 25 వేల రూపాయల నగదును స్వాధీనపరచుకున్నామని నిందితులను యూపీ రాష్ట్రంలోని బిజ్నూర్ జిల్లా కోర్టులో ప్రవేశపెట్టి జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టామని నిందితులు చోరీ ఘటనకు 15 రోజుల ముందే హైదరాబాద్‌లోని పహాడీషరీఫ్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారని నిందితులు గతంలో 2008లో హైదరాబాద్ అఫ్జల్‌గంజి ప్రాంతంలోని ఆర్టీసి బస్సులో బ్యాగును అపహరించిన కేసులో నిందితులుగా ఉన్నారని అలాగే జడ్చర్లలో కూడా నిందితులు దిల్షాద్, షారూఖ్, సత్తార్‌లు కలిసి చోరీకి పాల్పడ్డారని దీంతో వారినిఅరెస్టు చేసి వారి నుండి29 లక్షల 25 వేల రూపాయలను రికవరీ చేయడం జరిగిందని మరో 75 వేల రూపాయలు హైదరాబాద్‌లోని ఇల్లు అద్దెకిచ్చిన వారికి ఇచ్చారని వాటిని కూడా వారినుండి త్వరలోనే రికవరీ చేస్తామని ఎస్పీ జానకి తెలిపారు. పట్టుబడ్డ నిందితుల్లో దిల్షాద్, షారూక్‌లను రిమాండ్‌కు తరలిస్తామని మరో నిందితుడు సత్తార్‌కు ఆరోగ్య సమస్యలు ఉండడంతో నోటీసులను అందజేశామని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా తక్కువ సమయంలో కేసును చేదించిన జడ్చర్ల రూరల్ సిఐ నాగార్జునగౌడ్ జడ్చర్ల ఎస్సై శివానంద్ గౌడ్, జడ్చర్ల పిఎస్ కానిస్టేబుల్ గోపాల్, మన్సూర్, బాలానగర్ కానిస్టేబుల్ బాలచంద్రుడు, వెంకటేష్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి వారికి రివార్డును అభినందించారు. జడ్చర్ల పట్టణ సిఐ ఆదిరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**ఒక్క సిసి కెమెరా వంద మంది పోలీస్ సిబ్బందితో సమానం..**

నేరాల నియంత్రణ కేసుల ఛేదనలో సిసి కెమెరాలు కీలక పాత్ర పోసిస్తాయని జడ్చర్ల పట్టణం వ్యాపారాలకు కేంద్ర బిందువుగా ఉందని కానీ సిసి కెమెరాలు అతి తక్కువగా ఉన్నాయని ప్రతి ఒక్క వ్యాపారి తమ షాప్‌ల వద్ద ఇండ్ల వద్ద బాధ్యతగా స్వీయరక్షణ కోసం సిసి కెమెరాలు అమర్చుకోవాలని సిసి కెమెరాలు అమర్చడంద్వారా నేరాలు నియంత్రించవచ్చునిచోరీలు జరిగినసమయంలో కేసుల చేతనకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. జడ్చర్ల పట్టణంలో సిసి కెమెరాలు అమర్చటానికై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించి సిసి కెమెరాలు అమర్చుటకు అవగాహన కల్పిస్తామని ఎస్పీ జానకి తెలిపారు.